

## సదానంద్ శారద

# పండుగ నవ్వు

ఉగాదిరోజు పొద్దున్నే వినతి లేచి భర్త చలపతి భుజాల చుట్టూ చేతులు వేసి గోముగా చూసింది

భార్య తనకేదో ఆదేశించబోతున్నదని అర్థంచేసుకున్న చలపతి—

"ఊ...చెప్పు" అన్నాడు.

"ఇవ్వాళ ఉగాది పండగ కదా..."

"అవును-"

"ఈరోజు ఆనందంగా, నవ్వుతూ గడిపితే సంవత్సరమంతా ఆనందంగా హాయిగా నవ్వులతో గడిచిపోతుందట"

"ఊ ..."

"అంచేత మనం ఈ రోజంతా నవ్వుతూ గడిపేయాలి, పొరపాటున కూడా విచారం రానివ్వద్దు-విసుగుపడొద్దు- త్వరగా పనులు పూర్తిచేసుకొని అలా షికారు వెళదాం-"

"సంవత్సరమంతా అలా షికార్లతో గడిపేస్తామా?"

"ఆఁ...ఈ రోజు మనం అస్సలే ఎవరితో గొడవ పడకూడదు. నవ్వుతూ ఉండాలి... ప్లీజ్ పతీ అలా చేస్తావు కదూ?"

"సరే...అలాగే-"
చటుక్కున వంగి అతని పెదాలమీద ముద్దుల వర్షం కురిపించింది...
"అంటే సంవత్సరమంతా ప్రతిరోజూ పొద్దున ఇలా..."
"ఛీ పో కొంటే...." లేచి బయటకి వెళ్ళి పోయింది వినతి.
కొంచెం సేపటికి ఆమె చిరునవ్వుతో తిరిగి వచ్చింది.
"ఇవ్వాళ పాల ప్యాకెట్ దొరకలేదట" అని చెప్పింది.
"పోనీలే ఈరోజు కాఫీ ఏదైనా హోటల్లో తాగుదాం..." నవ్వుతూ అన్నాడు చలపతి.
భర్తవంక ఎంతో మురిపెంగా చూసి వంటింట్లోకి నడిచింది వినతి.
స్నానంచేసి వచ్చి—
"త్వరగా లే పతీ— స్నానంచేసి వేప పువ్వు, మామిడికాయ కొనుక్కురావూ- పచ్చడి చేయాలి కదా—" అంది.
"ఓ యస్ అలాగే..."
లేచి టాయిలెట్ రూంవేపు నడిచాడు చలపతి వెళ్ళినవాడువెళ్ళినట్టే తిరిగివచ్చాడు.
ఏమైంది అన్నట్టు చూసింది వినతి.
"ఖాళీలేదు—"నవ్వుతూ చెప్పాడు చలపతి
"పోనీ ఈలోగా పళ్ళు తోముకోరాదూ-"
"సరే—"
బ్రష్ తీసుకుని పేస్టుకోసం వెదికాడు. ఇంకా ఆ నెలలో సామాన్లు తేలేదని గుర్తుకొచ్చింది. కంపెనీలో స్ట్రయిక్, జీతం ఇంకో వారం రోజులకిగానిరాదు. ఇంతాక వినతి "ఆ లా షి కా రు కు" అన్నట్టు గుర్తు...
జేబులన్నీ వెదికితే ఐదురూపాయల చిల్లర దొరకొచ్చు
ఐదు రూపాయలతో "భార్యతో షికారు" అంటే హైదరాబాద్ సిటీకి ఎంత నామోషి! షికారుకొద్దు గదిలోనే హాయిగా కబుర్లు చెప్పుకుందాం అంటే వినతి మొహం చిన్నబుచ్చుకుంటుందేమో!
గళ్ళ లుంగీకట్టి, బనీను చిరుగుమీద తువ్వాలు కప్పుకొని గదిబయట నిల్చొని ఆలోచిస్తున్నాడు చలపతి.
చేతిలోచిక్కిన పేస్ట్ట్యూబ్ వంక ఒకసారి చూశాడు. వత్తిలా మిగిలిన ఆట్యూబ్‌ను వొత్తివొత్తి అతనికి విసుగొచ్చింది.
రేపు కొత్త వాతేలి అనుకుంటూ నాలుగు రోజుల్నుంచి దానితోను స్త్రిపకుతున్నాడు. వినతి ఎలా తోముకుందో-ఇలాగే అవస్థ పడి ఉంటుంది లేక పండగరోజు కదా నవ్వుకుంటూ ఏ బొగ్గుముక్కనో కర కర నమిలి ఉంటుంది.
ఆట్యూబ్‌నేదించి రెండుముక్కలుచేశాడు ఒక్కో ముక్కను చదరంగా చేసి కొంచెం నీళ్ళుచల్లి బ్రష్‌తో అందులోని పేస్ట్ అవశేషాలను గీకి తీరాడు-


o o o

స్నానంచేసి తల తుడుచుకుంటూ గదిలోకి వచ్చిన చలపతికి భార్య మొహం చూడాలంటే భయమేసింది.
అయిదు రూపాయలతో షికారా! అయిదు రూపాయలతో షికారా! అతని మనసులో ఒకటే హోరు...పోరు-
"వచ్చావా త్వరగా డ్రెస్ వేసుకో మామిడికాయ, వేపపువ్వు, బెల్లం.." గడగడ లిస్టు చదివేస్తున్నది.
అమ్మబాబోయ్! షికారుమాటదేవుడెరుగు- ముందీ లిస్టును ఎదుర్కొనేది ఎలా?

పరీక్షలో తప్పిన మొద్దబ్బాయిలా మొహం పెట్టబోయి పండుగనవ్వు గుర్తు కొచ్చి నవ్వుతూ భార్యవంక చూశాడు-
"ఓస్ ఇంతేనా...కొనేద్దాం-" అన్నాడు తల దువ్వుకుంటూ-
"వినతి నా పేంటొకసారి పట్రా-" అన్నాడు.
తెచ్చింది.
"జేబులో ఎంతుందో చూశావా?"
"చూశాను-"
''మరి?" నవ్వుతూ చూశాడు.
"నీకెందుకు నేనిస్తాగా-"
అర్థం కాలేదు చలపతికి-
"పండుగపూట అప్పు తెస్తావా వినతీ! సంవత్సరమంతా అప్పులేకావూ?..."
"ఛీ నేనంత తెలివితక్కువదాన్ని అనుకున్నావా! పండుగరోజు అప్పుతేవడానికి నిన్ననే అడిగిపెట్టాను- ఇదిగో" యాభై రూపాయలనోటు అందించింది.
"నెలకు అయిదు రూపాయలు వడ్డీ-" నవ్వుతూ చెప్పింది-
"ఓస్ అంతేనా-జీతం రాగానే ఇచ్చేయమూ-" నవ్వుతూ అన్నాడు చలపతి-
ఇద్దరు మరోసారి జంటగానవ్వుకున్నారు. ఆ తరువాత చలపతి ఈలపాటకూడా అందుకున్నాడు-
రఘురామయ్యగారు ఎక్కడున్నా సంతోషించాలి ఇలాంటి ఏకలవ్యులనుచూసి-
అతని షర్ట్ గుండీలు వినతే పెట్టింది. చెప్పులు తుడిచి ఇచ్చింది.
ఆమె బుగ్గన చిటికేసి బ్యాగ్ అందుకొని బజారుకు నడిచాడు చలపతి-
"పతీ..." అని పిలిచింది.
''ఏమిటోయ్?'' వెనక్కు తిరిగొచ్చాడు.
"తోరణాలకు మామిడాకు, వేపకొమ్మలు మరచిపోకు-"
"ఊహు...మరచిపోను-మరి బక్షాలకు నెయ్యి కావద్దూ?"
"ఆ బక్షాలు నాకు చేయరావు బాబూ-'' నవ్వుతూ అంది వినతి.
"నాకు వచ్చుకదా...నువ్వైతె శనగపప్పు ఉడకబెట్టు-" నవ్వుతూ చెప్పాడు చలపతి.
"శనగపప్పులేదు-వచ్చేటప్పుడు తీసుకరా- అలాగే కిలో గోధుమపిండి.... యాలకులు...''
''సరె సరె అవన్నీ నేను చూసుకుంటాలె..."
నవ్వుతూ ఈలవేసుకుంటూ వెళుతున్న భర్తను చూసి హాయిగా నవ్వుకుంది వినతి-

౨ ౦ ౦

బజారునుంచి వచ్చిన చలపతికి భార్య ముందు గదిలోనే ఎదురయింది-
"తోరణాలకు మావిడాకు, వేపకొమ్మలు తెమ్మన్నావుకదోయ్ వాటికే రెండు రూపాయలు-" నవ్వుతూ చెప్పాడు.
"అంతేకదా..." నవ్వింది వినతి.
"మొత్తం ముప్పై రూపాయలు"
"ఊఁ...ఇవ్వాళ పంపు తొందరగా బందయింది పతీ వంటగది ఒక్కటే కడిగాను. ముందు రూము కడగలేదు"
"ఫరవాలేదులే-రేపు కడుగొచ్చు."
"పచ్చడికో చెంబెడు, తాగడానికి పెద్ద చెంబెడు నీళ్ళు చాలుకదా...మనం అలా షికారుకు వెళ్ళొస్తాం కదా-"
"ఓ బస్ బస్..."
ఆనందంగా భర్త షర్ట్ గుండీలు విప్పింది అతడు లుంగీ చుట్టుకుంటుండే పేంటు కూడా తనే విప్పింది.




ఇద్దరు కష్టపడి పచ్చడి చేసుకొని, బక్షాలు చేసుకొని తినేసరికి మధ్యాహ్నం రెండయింది.

మ్యాట్నీకి కుదరదు కనుక ఫస్ట్‌షోకు వెళ్దాం అనుకున్నారు.

ఆ-తలో ప్రక్క వాటావాళ్ళ అబ్బాయి "అంకుల్ మీకు ఉత్తరం" అంటూ ఒక కవరు అందించి వెళ్ళాడు.

"ఎవరో ఉగాది శుభాకాంక్షలు పంపించి వుంటారు తెరువు" అంది ఆసక్తిగా వినతి

కవరు తెరచి అందులోని ఉత్తరాన్ని చదివాడు చలపతి.

వడ్డీ సరిగా కట్టడంలేదని వార్నింగ్ ఇస్తూ చలపతి తీసుకున మూడువేల రూపాయలు అప్పు ఇప్పుడు నాలుగు వేలు అయిందని గుర్తుచేస్తూ అతని నేటివ్ ప్లేస్ నుంచి గునిశెట్టి గుర్నాథం రాసిన ఉత్తరం అది.

ఉద్యోగానికి లంచం అవసరంపడి చేసిన అప్పు అది.

నవ్వుతూ భార్యవంక చూశాడు చలపతి.

"ఆఁ? రెండు సంవత్సరాల్లో తీర్చేస్తామని ఉత్తరం రాసేయ్" నవ్వుతూ చెప్పింది వినతి.

"ఓయస్ అలాగే తీర్చేద్దాం" అన్నాడు చలపతి.

కొంచెంసేపయాక—

"ఏ సినిమాకు వెళ్దాం పతీ?" అని అడిగింది వినతి

"నువ్వే చెప్పు-"

"శాంతిలో శ్రీవారికి ప్రేమలేఖ నిండా నవ్వులేనట..."

"ప్రేమలేఖ నిండా నవ్వులా?"

"ప్రేమలేఖ నిండా కాదోయ్...సినిమా నిండా...."

"ఊహుఁ..."

"పండగ రోజు బాగుంటుంది-హాయిగా నవ్వుకోవచ్చు—దానికే వెళ్దాం"

"సరే అలాగే"
పండుగరోజు హాయిగా వెళ్ళాలని వాళ్ల సాయంకాలం ఆటోలో సినిమాకు బయ ల్దేరారు.
ఆటోవాడికి ఆ రోజు పండుగే ఉన్న ట్టుంది. నిదానంగా నడుపుతూ మధ్య మధ్యలో ఆపి స్కేలుతో పెట్రోలును కొలుస్తూ మొత్తంమీద అరుగంటలకు థియేటర్ ముందుకు చేర్చాడు వాళ్ళను.
అప్పటికే హౌస్‌ఫుల్?
నవ్వుతూ "హౌస్‌ఫుల్" అంది వినతి.
"మరో సినిమా ట్రై చేద్దాం" అన్నాడు చలపతి.
"అమ్మో ఏ సినిమా ఎలాగుంటుందో కొంపదీసి ఏ ట్రాజిడో చూశామంటె..."
ఆ ఊహనే భరించలేకపోయింది.
"సినిమా మరోనాడు చూద్దాంలే అలా హాయిగా టాంక్‌బండ్ మీద కూర్చుం దామా?" అని అడిగింది సరదాపడుతూ.
"సరే"
"టాంక్‌బండ్‌కు వెళ్దామా సార్" ఆ ఆటోవాడు ఇంకా అక్కడే ఉన్నాడు.
ఎలాగూ సినిమా డబ్బులు మిగిలాయి కనుక మారుమాట్లాడకుండా ఇద్దరు ఆటోలో ఎక్కి కూర్చున్నారు.
ఆటో ముందుకు దూసుకుపోయింది.
టాంక్ బండ్ చేరి ఓ ఖాళీ సిమెంట్ బెంచ్‌నో, చెక్క బెంచినో వెదికి పట్టు కొనేసరికి వాళ్ళకు పావుగంట పట్టింది.
రెండు రూపాయలుపెట్టి మూరెడు పూల దండకొని టాంక్ బండ్ మీద తమ సాయంకాలానికి మరింత అందాన్ని, ఆనందాన్ని తెచ్చాడు చలపతి
రాత్రి ఎనిమిది గంటలదాకా అక్కడే కూర్చున్నారు.
సెకండ్ షోకు వెళ్ళడానికి వీల్లేదు ఇంటి ఓనరు ముందే వార్నింగు ఇచ్చాడు పదకొండుదాటిందంటే బయటి తలుపులు తెరవబడవని.
"ఇక వెళ్దామా వినతీ..." అడిగాడు చలపతి అతని భుజం మీద తలవాల్చిన వినతి "ఊ" అంది మెల్లగా.
పర్సులో ఇక ఏడు రూపాయలు మిగిలా యని చలపతికితెలుసు. మళ్ళీ ఇప్పుడు ఆటోలో ఇంటికి వెళ్తే ఆ ఏడు రూపా యలూ హారతి కర్పూరం!
ఎంత స్ట్రయిక్ నడుస్తున్నా రోజూ కం పెనీకి పోక తప్పదుకదా! ఏడు రూపా యలుంటె ఎందుకైనాపనికొస్తాయ్. మళ్ళీ చేతిలో డబ్బులు పడేదాకా బస్సుచార్జీలకే కావాలి రోజూ రెండు రూపాయలు.
"హాయిగా బస్సులో పోదామా వినతీ" నవ్వుతూ అడిగాడు చలపతి.
"అలాగే" అంది నవ్వుతూ వినతి.
మరో అరగంట తరువాత అతి కష్టం మీద ఒక బస్సులో ఎక్కగలిగారు.
అసలే బస్సుల నిండా ఎప్పుడూ జనం. అందులో పండుగరోజు ఫస్ట్ షోలు వొది లేసిన సమయం...
గంటసేపు బస్సులో నరకాన్ని నవ్వుతూ అనుభవించారు.
బస్సు దిగి ఇంటి వేపు నడుస్తున్నారు.
దాహంగా ఉంది చలపతికి సోడా తాగు దామని జేబులో చేయిపెట్టాడు.
"పతీ..." అంది మెల్లగా వినతి
ఏమిటన్నట్లు చూశాడు.
"బస్సులో రష్ బాగా ఉంది కదా... ఒకపక్కకు ఒదిగి నిల్చున్నాను. బస్సు

రేకు తట్టుకొని ఇదిగో..." చిరిగిన చీరెను చూపించింది

రెండు వందల యాభై రూపాయలు పెట్టి ఆ చీరెనకొని రెండు నెలలు కాలేదు. నిజానికి వినతికి ఉంది అదొక్కటే మంచి చీరె.

"డార్నింగ్ చేయిస్తే బాగానే ఉంటుంది కదూ" అంది నవ్వుతూ.

"అవును" అన్నాడు చలపతి నవ్వుతూ. ఆ నవ్వులో... ఉన్న ఏడురూపాయలు బస్సులో ఎవరో కొట్టేశారన్న విషయం దాచేశాడు.

ఇల్లు చేరుకోగానే ఎదురైన ఇంటి ఓనర్‌నుచూసి గుండె గుభేలుమంది చలపతికి గడియారం వంక చూసుకున్నాడు- పదిమాత్రమే అయింది.

"వచ్చావా నాయనా నీకో శుభవార్త" అన్నాడు ఇంటి ఓనర్ చలపతిని చూడగానే-

ఏంవార్తోనని ఆనందంతో వినతిమొహం విప్పారింది.

"మీ కంపెనీ స్ట్రైక్ కాలాఫ్ అయింది నాయనా- మీ డి.ఏ. పెంచడానికి కంపెనీ యజమాన్యం ఒప్పుకున్నదట-సాయంకాలంవార్తల్లోచెప్పారు.

"అలాగా..."

"అయితె నీ జీతం ఎంత పెరుగుతుంది బాబూ?"

"నెలకు ఇరవై రూపాయలదాకా ఉంటుంది-"

"ఉహుఁ..."

"ఇంకా నిద్రపోలేదా బాబాయ్ మీరు?" తాళం తీస్తూ అంది వినతి—

"ఆఁ...మా బామ్మర్ది ఇందాక వచ్చి వెళ్ళాడు-మీరుంటున్న పోర్షను అద్దెంత అని అడిగాడు - రెండువందలయాభై అని చెప్పాను-తన దోస్తు ఎవరికో కావాలి రెండొందల డెబ్బయ్యయిదు అద్దె ఇస్తారు అన్నాడు—నేను ఒప్పుకోలేదు-చలపతి మంచి కుర్రాడు-ఆ మాత్రం అద్దె వాళ్ళు ఇవ్వగలరు అని చెప్పాను-"

గదిలో అడుగుపెట్టిన చలపతి మొహం మీదికి ఝుమ్మని దోమలు దాడిచేశాయి-

"అలాగే బాబాయ్—" నవ్వుతూ లైటు వేసింది వినతి—భర్తను మోచేత్తో పొడిచింది.

"అలాగే అంకుల్ దానికేం అలాగే ఇస్తాం..." నవ్వుతూ చెప్పాడుచలపతి- లౌక్యంగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు ఇంటి ఓనర్-

తలుపులుతీసి కిటికీగుండా దూకి పిల్లులు వంటగదిలో పోట్లాడుకుంటున్నాయి. పెద్ద చెంబెడు మంచినీళ్ళు వొలకబోశాయి—

అంతలో కరెంటుపోయింది—

"ఇంకెంతసేపు ఉంటుంది వినతీ పండుగ?" అడిగాడు చలపతి-

"ఎందుకు?"

భర్త అలా ఎందుకడిగాడో అర్థంకాలేదు వినతికి.

"ఎందుకు పతీ?" అని మళ్ళీఅడిగింది.

"ఇక నేను నటించలేను- ఈ అబద్ధపు నవ్వులు నవ్వలేను-" చలపతి బాధగా—

వినతి మాట్లాడలేదు.

కిటికిలోంచి ఆకాశంలో కనిపించేమిణుకు మిణుకు తారలవంక చూస్తోంది..." *